క్లుప్తంగా

సీఎంను కలిసిన ఎమ్మెల్యే బియ్యపు మధు

శ్రీకాళహస్తి: రేణిగుంట విమానాశ్రయంలో శుక్రవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి స్వాగతం పలికారు. వాకాడు మండలంలో తుపాన్ ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించేందుకు విమానంలో ఆయన ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా గా శ్రీకాళహస్తి నియోజకవర్గంలో తుపాన్ వర్షాలతో జరిగిన పంట నష్టాన్ని, దెబ్బతిన్న ఇళ్ల వివరాలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

మైదానాలను సిద్ధం చేయాలి

సత్యవేడు: ఈనెల 15 నుంచి ప్రారంభమయ్యే ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలను విజయవంతం చేయాలని ఎంపీడీఓ చంద్రశేఖర్ అన్నారు. శుక్రవారం మండలంలోని పీవీపురం సచివాలయం పరిధిలో ఆడుదాం ఆంధ్రా కింద నయోదైన రిజిస్ట్రేషన్లను ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, బ్యాడ్మింటన్, ఖోఖో పోటీలను నిర్వహించనున్నట్లు తెలిపారు. పంచాయతీ పరిధిలో క్రీడా మైదానాలను సిద్ధం చేయాలన్నారు.

కళాశాలలో మరుగుదొడ్లు ధ్వంసం



పిచ్చాటూరు: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద నాడు–నేడు పథకం కింద గురువారం ఉదయం నిర్మించిన మరుగుదొడ్లను రాత్రి కొందరు ఆకతాయిలు కూల్చేశారు. ఉదయం అధ్యాపకులు, ప్రిన్సిపల్ కళాశాలకు రాగానే ధ్వంసమైన గోడలను గుర్తించారు. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ నిధులతో నిర్మించిన గోడను కూల్చిన వారిపై కఠినంగా శిక్షించాలని ప్రిన్సిపల్ శ్రీధర్ కోరారు.

రక్తదాన శిబిరం

శ్రీకాళహస్తి: పట్టణంలోని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు, పరివర్తన సంస్థ ఆధ్వర్యంలో శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి రక్తదాన శిబిరం జరిగింది. ఈ కార్యక్రమానికి బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్, ఆస్పత్రి సూపరింటెండెంట్ విజయలక్ష్మి ముఖ్య అతిథులుగా విచ్చేశారు. బ్యాంకు బ్రాంచ్ మేనేజర్ హేమశేఖర్, ఆపరేషన్ మేనేజరు బాలచంద్ర, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నిధుల వినియోగంపై అవగాహన

సత్యవేడు: మనబడి నాడు–నేడు ఫేజ్1, ఫేజ్2లో పాఠశాలలకు మంజూరైన స్కూల్ మెయింటినెన్స్ ఫండ్(ఎస్ఎంఎఫ్) వినియోగం, ఇతర పాఠశాలకు 50 శాతం నిధుల మళ్లింపుపై ఎంఈఓ కె.రవి ఆధ్వర్యంలో అవగాహన సమావేశం జరిగింది. శుక్రవారం ఎంఈఓ మాట్లాడుతూ కేటాయించిన పాఠశాలలకు రేపటిలోగా నిధులు మళ్లించాలని సూచించారు. ఎంపీడీఓ కె.చంద్రశేఖర్, ఎంఈఓ–2 ఉష, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

నియామకం



ఉదయ్

తొట్టంబేడు (శ్రీకాళహస్తి): అఖిల భారత దళిత, గిరిజనుల సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడిగా కోగిల ఉదయ్ నియమితులయ్యారు. శుక్రవారం జిల్లా అధ్యక్షుడు గంధం చంద్రశేఖర్ అధ్యక్షతన తొట్టంబేడు మండల కమిటీ ఎన్నిక కార్యక్రమాన్ని నిర్వహించారు. మండలంలోని లింగమనాయుడుపల్లి పంచాయతీ కురవకనేరి గ్రామానికి చెందిన ఉదయ్ ని సంఘం మండల అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎంపిక చేసి, ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు.

బ్రిడ్జి నిర్మించాలని ఆందోళన



ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

కేవీబీపురం: మండలంలోని రాజులకండ్రిగ–పూడి మార్గంలోని కాజ్‌వేను అభివృద్ధి చేసి బ్రిడ్జి నిర్మించాలని డిమాండ్ చేస్తూ పోలినాయుడుకండ్రిగ, పూడి, సీకేపురం గ్రామాలకు చెందిన ప్రజలు శుక్రవారం రాజులకండ్రిగ కూడలిలో ఆందోళనకు దిగారు. ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలగడంతో కేవీబీపురం ఎస్ఐ సిబ్బందితో రంగప్రవేశం చేసి ఆందోళనకారులకు నచ్చజెప్పి విరమింపజేశారు. ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. అనంతరం ఆందోళన కారులు విలేకరులతో మాట్లాడుతూ వరదలు వచ్చిన ప్రతిసారీ పూడి కాజవే కొట్టుకుపోయి, తాము బాహ్య ప్రపంచంతో సంబంధాలు కోల్పోతున్నామని తెలిపారు.

నీట మునిగిన పంట పరిశీలన

బుచ్చినాయుడుకండ్రిగ: తుపాన్ కారణంగా మండలంలోని గాజులపెళ్లూరులో నీట మునిగిన వరి పంటను శుక్రవారం వ్యవసాయాధికారి భారతి పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ పలు చెరువులు నిండిపోయి కలుజు పారుతుండడంతో, కలుజు నీరు పారేందుకు కాలువలు లేక పోవడంతో పంట పొలాల్లో ప్రవహిస్తోందని తెలిపారు. 2 వేల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నట్లు పేర్కొన్నారు.

ఆడుదాం.. విజయపథాన నిలుద్దాం

- జోరుగా ఆడుదాం ఆంధ్ర ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్లు
- ఐదు విభాగాల్లో ఎంపిక పోటీలు
- ఉత్సాహం చూపుతున్న క్రీడాకారులు



వరదయ్యపాళెం సచివాలయం-1లో పేర్ల నమోదుకు వచ్చిన బాలికలు

రాష్ట్ర ప్రభుత్వం విద్యతో పాటు క్రీడలకు అధిక ప్రాధాన్యం ఇస్తోంది. అందులో భాగంగా ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం పేరుతో క్రీడాపోటీలుకు శ్రీకారం చుట్టింది.15 ఏళ్ల పైబడిన యువతీ,యువకులకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, క్రికెట్, బ్యాడ్మింటన్ తదితర 5 విభాగాల్లో ఎంపిక పోటీలు నిర్వహించనున్నారు. ఈ 15న పోటీల నిర్వహణకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. మైదానాలను సిద్ధం చేస్తున్నారు.

వరదయ్యపాళెం: సత్యవేడు నియోజకవర్గంలో ఆడుదాం ఆంధ్రకు క్రీడాకారుల రిజిస్ట్రేషన్లు జోరుగా సాగుతున్నాయి. గ్రామ, వార్డు స్థాయి క్రీడా పోటీల నిర్వహణకు నియోజకవర్గంలోని 7 మండలాల్లో ఇన్‌చార్జ్‌లను నియమించారు. వీరి ద్వారా క్రీడా పాఠశాల మైదానాలను ఎంపిక చేస్తున్నారు. పాఠశాలల్లోని పీఈటీ, పీడీ, ప్రధానోపాధ్యాయుల వివరాలు సేకరించారు. అంపైర్ల వివరాలను నమోదు చేయనున్నారు.

గ్రామ, వార్డు స్థాయి నుంచి..

పోటీలను ముందుగా గ్రామ, పట్టణాల్లోని వార్డు స్థాయిలో నిర్వహిస్తారు. తర్వాత మండల, పట్టణ, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయిలో నిర్వహిస్తారు. గ్రామ స్థాయి నుంచి మండల స్థాయి వరకు విజేతలకు క్రీడా పరికరాలు, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయి విజేతలకు నగదు బహుమతులు అందజేయనున్నారు.

జట్టు సభ్యులు ఇలా..

వాలీబాల్ జట్టులో 6 నుంచి 12 మంది, కబడ్డీ జట్టులో 7 నుంచి 12 మంది, ఖోఖో జట్టులో 9 నుంచి 12 మంది, క్రికెట్ జట్టులో 11 నుంచి 16 మంది, బ్యాడ్మింటన్ జట్టులో ఇద్దరు చొప్పున క్రీడాకారులు ఉంటారు. పోటీల ఇన్‌చార్జ్‌లుగా గ్రామ, వార్డు సచివాలయ పరిధిలో తహసీల్దార్, ఎంపీడీఓ, ఎంఈఓ, ఏఈ, ఈఓఆర్‌డీలు వ్యవహరిస్తారు. ఈమేరకు వారు సమావేశాలు నిర్వహిస్తూ సచివాలయ సిబ్బంది, ప్రధానోపాధ్యాయులకు అవగాహన కల్పిస్తున్నారు.



కబడ్డీ పోటీలకు పేర్లు నమోదు చేసుకుంటున్న యువకులు

విజేతలకు నగదు బహుమతులు

పోటీల్లో విజేతలకు నగదు బహుమతులు అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. బ్యాడ్మింటన్, కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, క్రికెట్ విజేతలకు నియోజకవర్గ స్థాయిలో ప్రథమ బహుమతి కింద రూ.35వేలు, ద్వితీయ, తృతీయ బహుమతుల కింద రూ.15వేలు, రూ. 5వేలు, జిల్లా స్థాయిలో రూ.60వేలు ప్రథమ బహుమతి, రూ.30వేలు ద్వితీయ బహుమతి, రూ.10వేలు తృతీయ బహుమతి అందించనున్నారు. అలాగే రాష్ట్ర స్థాయి పోటీల్లో బ్యాడ్మింటన్ విజేతలకు రూ.5లక్షలు ప్రథమ బహుమతి, రూ. 3లక్షలు ద్వితీయ బహుమతి, రూ.2లక్షలు తృతీయ బహుమతి ప్రదానం చేస్తారు. రాష్ట్రస్థాయి పోటీల్లో కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, క్రికెట్ విజేతలకు రూ.2లక్షలు ప్రథమ బహుమతి, రూ.లక్ష ద్వితీయ బహుమతి, రూ.50వేలు తృతీయ బహుమతి అందజేస్తారు.

పోటీల నిర్వహణకు కసరత్తు

ఆడుదాం.. ఆంధ్ర క్రీడా పోటీల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నాం. ఈనెల 15న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అమరావతి నుంచి లాంఛనంగా ప్రారంభిస్తారు. ఐదు క్రీడాంశాల్లో పోటీలు నిర్వహిస్తారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు ముందుగా పేర్లు నమోదు చేసుకోవాలి. ప్రభుత్వం క్రీడలను ప్రోత్సహించడంతో ఎంతో మంది ఉత్తమ క్రీడాకారులు తయారవుతున్నారు.

–బందిల కుమార్, మండల క్రీడా సాధికారత కో–ఆర్డినేటర్, వరదయ్యపాళెం మండలం

అభివృద్ధి ప్రదాత జగనన్న



కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు

శ్రీకాళహస్తి: అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా పాలన చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అభివృద్ధి ప్రదాత అని పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు అన్నారు. పట్టనంలోని ఎంఎం వాడ సచివాలయం–1 పరిధిలో శుక్రవారం ఆంధ్ర ప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి కార్యక్రమం నిర్వహించారు. 19, 21 వార్డులకు సంబంధించి మా నమ్మకం నువ్వే జగన్ సంక్షేమ పథకాల పట్టికను ఆవిష్కరించారు. నాయకులు మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తరువాత రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి పరుగులు తీస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఈర్ల మాధవ, బావాజీ, జిలానీబాషా, యోగానంద్, గౌస్‌బాషా, దనమ్మ తదితరులు పాల్గొన్నారు.



పథకాల లబ్ధి బోర్డు ఆవిష్కరణ

పథకాలు అమలు జగనన్నతోనే సాధ్యం

తొట్టంబేడు (శ్రీకాళహస్తి): ఆంధ్రప్రదేశ్ ప్రజలందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు సక్రమంగా అందాలంటే జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాల్సిన అవసరం ఉందని వైఎస్సార్‌సీపీ శ్రీకాళహస్తి మండల అధ్యక్షుడు వయ్యాల కృష్ణారెడ్డి అన్నారు. శ్రీకాళహస్తి మండలం సుబ్బానాయుడు కండ్రిగలో శుక్రవారం ఆంధ్రప్రదేశ్‌కు జగన్ ఎందుకు కావాలి కార్యక్రమాన్ని నిర్వహించారు. నాయకులు గున్నయ్య, శంకరయ్య, కృష్ణయ్య, వెంకటేష్, మధుమోహన్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి, గోవిందరెడ్డి, చెంగల్‌రాయులు, మురగయ్య, సుధాకర్‌రెడ్డి, రామిరెడ్డి, సురేంద్ర, సుబ్బమ్మ, తదితరుల పాల్గొన్నారు.

పల్లమాల చెరువుకు జల హారతి



బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని పల్లమాల చెరువు భారీ వర్షాలతో నిండి కలుజు పారడంతో గ్రామ మహిళలు శుక్రవారం గంగదేవి ప్రత్యేక పూజలు చేశారు. చెరువులోని నీటిపై దీపాలను వెలిగించి పసుపు, కుంకుమ, పూలు చల్లి ప్రత్యేక పూజలు చేశారు. హారతులు ఇచ్చారు. వర్షాలతో చెరువు నిండి నీటితో కళకళలాడుతుందని, నీటి కొరత లేకుండా పంటలు బాగా పండాలని పూజలు చేసినట్లు మహిళలు తెలిపారు.

13న హుండీ కానుకల లెక్కింపు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరస్వామి ఆలయంలో ఈనెల 13వ తేదీన హుండీ కానుకలను లెక్కించనున్నట్లు ఈవో కేఎస్ రామారావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆలయంలోని ప్రధాన హుండీలతో పాటు పరివార దేవతల వద్ద ఉన్న హుండీల కానుకలను గురుదక్షిణామూర్తి సన్నిధిలో లెక్కించనున్నట్లు తెలిపారు. అధికారులు, సిబ్బంది తప్పనిసరిగా హాజరు కావాలన్నారు.

అన్ని రంగాల్లో రాణించాలి

బుచ్చినాయుడుకండ్రిగ: విభిన్న ప్రతిభావంతులు అన్ని రంగాల్లో రాణించాలని మండల విద్యాశాఖాధికారి మునిసుబ్రమణ్యం తెలిపారు. శుక్రవారం స్థానిక భవిత కేంద్రంలో దివ్యాంగుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆటల పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు, వివిధ ఉపకరణాలను పంపిణీ చేశారు. ఐఈఆర్‌టీఆర్ అయ్యప్ప, నయోమి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పంట పొలాల్లో ఇసుక మేటలు



పొలంలో పేరుకుపోయిన ఇసుక

బుచ్చినాయుడుకండ్రిగ: మిచాంగ్ తుపాన్ భారీ వర్షాలకు కాళంగి నది ఉధృతంగా ప్రవహించడంతో పల్లమాల గ్రామానికి చెందిన 30 మంది రైతులకు సంబంధించిన 60 ఎకరాల పొలాల్లో ఇసుక మేటలు ఏర్పాడ్డాయి. పంటలు దెబ్బతిని పొలాలు రూపు రేఖలు లేకుండా పోయాయి. వరద ప్రవాహానికి పొలాలలో భారీగా గోతులు ఏర్పాడాయి. దీంతో రైతులు లబోదిబోమంటున్నారు. ఇసుక మేటలును శుభ్రంగా చేసుకోవలంటే ఎకరాకు రూ.25 వేలు ఖర్చు అవుతుందంటున్నారు. నది ఒడ్డున ఉన్న 20 విద్యుత్ మోటార్లు ప్రవాహంలో కొట్టుకు పోయాయి. వ్యవసాయశాఖ అధికారులు ఇసుక మేటలను పరిశీలించి, ప్రభుత్వం ఆర్థిక సహాయం కోసం నివేదిక పంపాలని రైతులు కోరుతున్నారు.

రైల్వే ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

రేణిగుంట: రైల్వే ఉద్యోగుల న్యాయమైన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని రైల్వే గుంతకల్ డివిజన్ సీనియర్ డివిజనల్ పర్సనల్ ఆఫీసర్ జెఎస్ చౌహాన్ అన్నారు. రేణిగుంట రైల్వే కల్యాణ మండపంలో శుక్రవారం మెగా గ్రీవెన్స్, మెడికల్ క్యాంపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. రైల్వే ఉద్యోగులు, పెన్షనర్లు పాల్గొని తమ వినతులు అందజేశారు. శిబిరంలో నిపుణులు పరీక్షలు చేసి మందులను పంపిణీ చేశారు. సీఎంఎస్ ప్రభావతి, సీఆర్ఎస్ వైద్యాధికారి డాక్టర్ నరసింహ నిషాంత్, రైల్వే డాక్టర్ రోహెనా పాఠాన్, రైల్వే ఇన్‌స్టిట్యూట్ సెక్రటరీ గోపాల్‌సింగ్, పెన్షనర్స్ అసోసియేషన్ చైర్మన్ హసన్ సాహెబ్, సెక్రటరీ జయంత్‌కుమార్, కోదండరామయ్య, రామ్మూర్తి పాల్గొన్నారు.



చౌహాన్‌ను సన్మానిస్తున్న యూనియన్ నాయకులు

శాస్త్రోక్తంగా పంచ లింగ పూజలు

శ్రీకాళహస్తి: పట్టణంలోని బజారువీధిలో వెలసిన శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో శుక్రవారం శాస్త్రోక్తంగా పంచలింగ పూజలు నిర్వహించారు. ముందుగా పంచలింగాలు(అన్నం, ఉద్ది పిండి, మట్టి, బాణాలింగం, వెండి లింగం ఏర్పాటు చేసి పలు రకాల పూజలు నిర్వహించారు. అనంతరం ఆర్యవైశ్య మహిళలు శివ అష్టోత్రం, గౌరీ, లక్ష్మీ అష్టోత్రం, గోవిందనామాలు పఠనం చేశారు.



పూజల్లో పాల్గొన్న మహిళలు

తుపాను బాధితులకు ఆపన్న హస్తం



మోదుగులపాలెం కాలనీలో సరుకులు అందజేస్తున్న ఎమ్మెల్సీ సుబ్రమణ్యం

ఏర్పేడు: మిచాంగ్ తుపాను బాధితులను ప్రభుత్వం అన్ని విధాల ఆదుకుంటుందని ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం అన్నారు. శుక్రవారం మండలంలోని మోదుగులపాలెం, ఎండీపుత్తూరు ఎస్టీ కాలనీలలో 150 కుటుంబాలకు నిత్యావసర సరకులు, ఏర్పేడులో 150 కుటుంబాలకు ప్రభుత్వం నుంచి వచ్చిన బియ్యం, కందిపప్పు, గోధుమ పిండి, నూనె తదితర సరకుల పంపిణీ చేశారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ సీఎం వైఎస్‌జగన్ మోహన్‌రెడ్డి వరద ప్రభావిత గ్రామాల్లో సత్వరమే సహాయ చర్యలు చేపట్టాలని ఆదేశించినట్లు తెలిపారు. పంటలు, నివాసాలు కోల్పోయిన బాధితులకు సహాయం అందిస్తామని చెప్పారు. వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ గున్నేరి కిషోర్‌రెడ్డి, సర్పంచ్ మోహనప్రియ, పార్టీ మండల అధ్యక్షుడు రమణయ్య యాదవ్, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు నల్లపాలెం శివయ్య, డాక్టర్ బాబు, నాయకులు రాజేంద్ర, దామోదరంరెడ్డి, చెంగయ్య, కృష్ణయ్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



వరదయ్యపాళెం: బీజీఆర్‌కాలనీలో నగదు పంపిణీ

బాధితులకు ఆర్థిక సాయం

వరదయ్యపాళెం: మండలంలో తుపాన్ కారణంగా ఇళ్లలోకి వర్షపునీరు చేరి ముంపునకు గురైన బాధితులకు ప్రభుత్వం ద్వారా శుక్రవారం ఆర్థికసాయం అందజేశారు. మండలవ్యాప్తంగా ఏర్పాటు చేసిన 8 పునరావాస కేంద్రాల పరిధిలోని 198 కుటుంబాలకు రూ.4.48లక్షలు పంపిణీ చేశారు. వరదయ్యపాళెం, సీఎల్ఎన్‌పల్లె, చిన్న పాండూరు, మత్తేరిమిట్ట, కడూరు ప్రాంతాల్లో బాధితులకు రేషన్ కార్డుల వారీగా ఒక్కరుంటే రూ.వెయ్యి, ఇద్దరుంటే రూ. 2వేలు, ఆపైన ఉన్నవారికి రూ.2500 చొప్పున పంపిణీ చేశారు. వరదయ్యపాళెంలోని బీజీఆర్‌కాలనీలో జెడ్పీటీసీ వెంకటేశ్వర్లు, దేవాంగ కార్పొరేషన్ డైరెక్టర్ తిలక్‌బాబు, సీఎల్ఎన్‌పల్లెలో సర్పంచ్ దుడ్డు వేణు, మత్తేరిమిట్టలో సింగిల్ విండో చైర్మన్ హరిబాబురెడ్డి, వైస్ ఎంపీపీ శ్యామలమ్మ, చిన్న పాండూరులో సర్పంచ్ శ్యామల సుబ్రమణ్యం, ఎంపీటీసీ సభ్యురాలు భువనేశ్వరి, ఉపసర్పంచ్ మహేంద్ర చేతుల మీదుగా వీఆర్వోలు నగదును పంపిణీ చేశారు. అలాగే మండలవ్యాప్తంగా 21 గ్రామాల్లో 850 కుటుంబాలకు 25కేజీల బియ్యం, కేజీ కందిపప్పు, లీటరు పామాయిల్ నూనె, ఒక కేజీ ఎర్రగడ్డలు పంపిణీ చేశారు. తహసీల్దార్ గౌరీ శంకరరావు, డిప్యూటీ తహసీల్దార్ శాంతి, ఆర్ఐ వేణుగోపాల్ పంపిణీ కార్యక్రమాలను పర్యవేక్షించారు.



కేవీబీపురం : సరుకుల పంపిణీ

కేవీబీపురం: మండలంలోని పెరిందేశం దళితవాడ, ఆదవరం, రాజులకండ్రిగ గిరిజన కాలనీలల్లో వరద బాధిత 100 కుటుంబాలకు బీఎస్పీ నేత రొక్కరోకల పరశురాముడు బియ్యం, పామాయిల్, కంది పప్పు, పాలు, చక్కెర, బిస్కెట్ ప్యాకెట్ తదితరాలు సాయంగా అందించారు. బీవీఎఫ్ కన్వీనర్ శేఖర్, ఆర్గనైజింగ్ సెక్రటరీ శివయ్య, పురుషోత్తం పాల్గొన్నారు.

తుపాన్ నష్టానికి నిధులు మంజూరు చేయండి

- సీఎంకు విన్నవించిన ఎమ్మెల్యే ఆదిమూలం



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి తుపాన్ నష్టాన్ని వివరిస్తున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

వరదయ్యపాళెం: మిచాంగ్ తుపాన్ కారణంగా నియోజకవర్గంలో కురిసిన భారీ వర్షాలకు జరిగిన నష్టం నివారణకు నిధులు మంజూరు చేయాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం విన్నవించారు. గూడూరు నియోజకవర్గంలోని వాకాడులో తుపాన్ బాధితల పరామర్శకు వచ్చిన ముఖ్యమంత్రిని కలసి ఎమ్మెల్యే వినతిపత్రాన్ని అందజేశారు. నాగలాపురం నుంచి టీపీకోట వరకు ఛిద్రమైన రోడ్డు మరమ్మతులకు తక్షణమే నిధులు మంజూరు చేయాలని, కేవీబీపురం మండలం టీకే పూడి రోడ్డు, వేములపూడి, పాతపాళెం రోడ్లకు, నారాయణవనం మండలం పాలమంగళం బ్రిడ్జి మరమ్మతులకు నిధులు మంజూరు చేయాలని కోరారు. కేవీబీపురం, బీఎన్‌కండ్రిగ మండలాల్లో ఎక్కువగా సాగుభూముల్లో ఇసుక మేటలు పడ్డాయని, పంట నష్టం జరిగిన రైతులకు సాయం అందజేయాలని విన్నవించారు. అన్ని కుటుంబాల వారికి మేలు చేసే విధంగా కలెక్టర్‌కు ఆదేశాలు ఇవ్వాలని ఎమ్మెల్యే కోరారు. స్పందించిన ముఖ్యమంత్రి తక్షణమే తుపాన్ నష్ట నివారణకు ఆయా శాఖల వారీగా నిధులు మంజూరు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని తన ప్రత్యేక కార్యదర్శి నారాయణ భరత్ గుప్తాకు సూచించినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

ఓటు హక్కు నమోదుకు నేడు చివరి గడువు

వరదయ్యపాళెం: రానున్న సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఓటు హక్కు నమోదుకు ఈనెల 9వ తేదీ చివరి అవకాశం కానుండడంతో అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే ఆదిమూలం పిలుపునిచ్చారు. నియోజకవర్గంలోని ఎంపీపీలు, జెడ్పీటీసీ సభ్యులు, సర్పంచులు, బూత్ కన్వీనర్లు బూత్‌ల వద్ద పర్యవేక్షించి, అర్హులతో ఓటు హక్కు నమోదుకు చొరవ చూపాలన్నారు. అలాగే డబుల్ ఎంట్రీలపైన దృష్టి సారించాలని తెలిపారు. వలంటీర్ల ద్వారా అవగాహన కల్పించేందుకు పార్టీ శ్రేణులు ప్రత్యేక చొరవ చూపాలన్నారు.

ముక్కంటి సేవలో ప్రముఖులు

శ్రీకాళహస్తి: శ్రీజ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని శుక్రవారం పలువురు ప్రముఖులు వేర్వేరుగా దర్శించుకున్నారు. హరిద్వార్ పీఠాధిపతి సూర్యచంద్రస్వామిజీ, తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ ఆలయ చైర్మన్ గోపియాదవ్ దర్శించుకున్న వారిలో ఉన్నారు. వారికి పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లుచేశారు. దర్శనానంతరం వేదపండితులు ఆశీర్వచనం ఇచ్చారు. జ్ఞాపిక, తీర్థప్రసాదాలను చైర్మన్ అందజేశారు. పాలక మండలి సభ్యులు, ఆలయ అధికారులు పాల్గొన్నారు.



ఆలయంలో హరిద్వార్ పీఠాధిపతి

కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన

సత్యవేడు: మండలంలోని దాసుకుప్పం సచివాలయం కార్యాలయంలో శుక్రవారం వికసిత్ భారత్ కార్యక్రమం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ పథకాలు వివరించేందుకు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పలువురు బీజేపీ నాయకులు,అధికారులు పాల్గొన్నారు. కిసాన్ సమ్మాన్ నిధి, కిసాన్ క్రెడిట్ కార్డులు, ప్రధానమంత్రి మాతృత్వ యోజన, ప్రధానమంత్రి ఆవాస్ యోజన, జలజీవన్ వంటి పథకాలను వివరించారు. ఈఓపీఆర్డీ మునిరవికుమార్, కార్యదర్శి రమణమూర్తి, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి మునిసుబ్రమణ్యం, మండల అధ్యక్షుడు ముని ప్రతాప్, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు మునికృష్ణయ్య, నాయకులు మోహన్ బాబు, వై. మురళి, సిద్ధలయ్య, ఏపీఎం స్వర్ణలత, ఏఈ మురళి, ఏపీఎం కృష్ణయ్య, పీహెచ్‌సీ డాక్టర్ గుణశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



పథకాలు వివరిస్తున్న నాయకులు

వైభవంగా ఏకాదశి ఉత్సవం

నారాయణవనం: మండల కేంద్రంలో టీటీడీ అనుబంధంలోని ప్రముఖ శ్రీ పద్మావతీ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఏకాదశిని పురస్కరించుకుని శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవతో ఆలయాన్ని తెరచి నిత్యపూజా కైంకర్యాలను పూర్తి చేశారు. శ్రీవేంకటేశ్వరస్వామి, పద్మావతీ అమ్మవార్ల మూల విరాట్‌లకు శుక్రవార అభిషేకాలను నిర్వహించారు. ఏకాదశి గడియల్లో అర్చనలు చేశారు. సాయంత్రం తిరుచ్చి వాహనంపై శ్రీదేవీ, భూదేవీ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామిని కొలువుదీర్చి తిరుమాడ వీధుల్లో ఊరేగించారు. భక్తులు అడుగడుగునా కర్పూర నీరాజనాలు సమర్పించారు. ఆలయానికి చేరుకున్న ఉత్సవర్లకు ఆస్థానం నిర్వహించి నైవేద్య సమర్పించారు. ఆలయ అధికారి నాగరాజు, భద్రతా జమేదార్ రాజశేఖర్ పర్యవేక్షించారు.



ఊరేగింపులో ఉభయ దేవేరులతో కల్యాణ వెంకన్న

పన్ను బకాయి దుకాణాలకు తాళం

శ్రీకాళహస్తి: మున్సిపల్ పరిధిలో అధిక పన్ను బకాయిలు ఉన్న దుకాణాలకు కమిషనర్ రమేష్‌బాబు ఆదేశాలతో శుక్రవారం సిబ్బంది తాళాలు వేశారు. కమిషనర్ మాట్లాడుతూ మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లో భారీ మొత్తంలో బకాయిలు ఉన్న దుకాణ యజమానులకు పలుమార్లు నోటీసులు అందజేసినా స్పందించలేదన్నారు. దీంతో ఉన్నతాధికారుల ఆదేశాలతో దుకాణాలకు తాళాలు వేసినట్లు తెలిపారు. బకాయిదారులు వెంటనే చెల్లించి మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించాలన్నారు. ఈకార్యక్రమంలో రెవెన్యూ అధికారి నారాయణరెడ్డి, అధికారులు బాలచంద్రయ్య, రవికాంత్, సిబ్బంది పాల్గొన్నారు.



దుకాణాలకు తాళం వేస్తున్న సిబ్బంది

లాలూ ప్రసాద్‌యాదవ్‌కు స్వాగతం

రేణిగుంట: బీహార్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, ఆర్‌జేడీ అధినేత లాలూ ప్రసాద్‌యాదవ్‌కు శుక్రవారం మధ్యాహ్నం రేణిగుంట విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. తిరుమల శ్రీవారి దర్శనార్థం ఆయన పాట్నా నుంచి ప్రత్యేక విమానంలో రేణిగుంటకు చేరుకున్నారు. ఆయనతోపాటు ఆయన సతీమణి మాజీ ముఖ్యమంత్రి రబ్రిదేవి, ఆయన తనయుడు బీహార్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి తేజశ్వి యాదవ్ చేరుకున్నారు. వారికి తెలంగాణ రాష్ట్ర మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్, పలువురు యాదవ సంఘ నాయకులు స్వాగతం పలికారు. అనంతరం వారు ప్రత్యేక కాన్వాయ్‌లో రోడ్డు మార్గాన తిరుమలకు బయల్దేరి వెళ్లారు.



లాలూప్రసాద్ యాదవ్‌కు స్వాగతం పలుకుతున్న యాదవ సంఘం నాయకులు

తిరుపతిని వైద్య క్షేత్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యం

రేణిగుంట: ప్రముఖ పుణ్యక్షేత్రమైన తిరుపతిలో అధునాతన వైద్య సేవలను అందుబాటులోకి తీసుకొచ్చి రానున్న రోజుల్లో వైద్య క్షేత్రంగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని అమర ఆస్పత్రి చైర్మన్ డాక్టర్ ప్రసాద్ గారినేని అన్నారు. మండలంలోని కరకంబాడి అమరరాజ కర్మాగారం ఆడిటోరియంలో శుక్రవారం మోకాలి తుంటి ఎముకలకు(హిప్) సంరక్షణ, శస్త్ర చికిత్సలపై అంతర్జాతీయ శిక్షణ సదస్సు నిర్వహించారు. దేశంలోని పలు ప్రాంతాల నుంచే కాకుండా ఇతర దేశాల నుంచి వైద్యులు పాల్గొన్నారు. ఇప్పటికే అమర ఆస్పత్రి ఆధ్వర్యంలో రెండుసార్లు ఇలాంటి శిక్షణ కార్యక్రమాలను నిర్వహించి అనేక మంది వైద్యులకు శిక్షణ ఇచ్చామన్నారు. బటన్‌హోల్ ద్వారా హిప్ ఆపరేషన్ల విధానంపై వీడియో చిత్రాల ప్రదర్శన ద్వారా ఆయన శిక్షణనిచ్చారు. అమర ఫౌండేషన్ ద్వారా ఆపరేషన్లు చేసుకునే స్తోమత లేని పేదలకు ఉచితంగా చేస్తామన్నారు. డాక్టర్ లీ విట్ కెన్, డాక్టర్ ఎన్టీయున్ సూన్ ట్రోంగ్, భారతదేశపు ప్రముఖ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ జగదీష్, అమర ఆస్పత్రి సీఏవో వేణుగోపాల్, ఏజీఎం శ్రీధర్, మార్కెటింగ్ మేనేజర్ నరసింహారావు, పీఆర్‌వో మునినాదం పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అమర ఆస్పత్రి చైర్మన్ ప్రసాద్ గారినేని